రాష్ట్రపతికి మేడారం జాతర విశిష్టతను తెలిపే చిత్రపటాన్ని అందజేస్తున్న మంత్రి సీతక్క. పక్కన పార్టీ జిల్లా అధ్యక్షుడు అశోక్

మేడారం మహాజాతరకు జాతీయ హోదా కల్పించాలి

■ రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు మంత్రి సీతక్క వినతి

ములుగు, డిసెంబర్ 23 (నమస్తే తెలంగాణ) : మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతరకు కేంద్ర ప్రభుత్వం జాతీయ హోదా కల్పించేందుకు కృషి చేయాలని కోరుతూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీశిశు సంక్షేమ శాఖల మంత్రి దనసరి అనసూయ సీతక్క రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు వినతిపత్రం శనివారం అందజేశారు. కాగా, శీతాకాల విడిది సందర్భంగా హైదరాబాద్‌కు విచ్చేసిన రాష్ట్రపతిని సీతక్క కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పీ అశోక్‌తో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. సమ్మక్క-సారలమ్మ జాతర విశిష్టతను తెలిపే చిత్రపటాన్ని అందజేశారు. ప్రతి రెండేళ్లకు ఒకసారి ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం గ్రామంలో నిర్వహించే మహాజాతరకు కోటిన్నర మందికిపైగా భక్తులు హాజరై అమ్మవార్లను దర్శించుకుంటారన్నారు. కాగా, కరోనా సమయంలో సీతక్క చేసిన సేవలను రాష్ట్రపతి ప్రశంసించి, చీరెను బహూకరించారు. అనంతరం రాష్ట్రపతికి హకీంపేట విమానాశ్రయంలో సీతక్క వీడ్కోలు పలికారు.

కృష్ణకాలనీ : భూపాలపల్లి శ్రీ చతుర్‌రూప అయ్యప్ప సహస్ర లింగేశ్వర స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

రేగొండ : కోటంచ లక్ష్మీ నర్సింహస్వామి ఊరేగింపులో పాల్గొన్న అశేష భక్తజనం

భూపాలపల్లి రూరల్ : వేంకటేశ్వరస్వామి ఆలయంలో భక్తులకు ప్రసాదం అందజేస్తున్న గండ్ర జ్యోతి

వైభవంగా ముక్కోటి ఏకాదశి

■ ములుగు, జయశంకర్ జిల్లాల్లో వేడుకలు
■ ఆలయాలకు భారీగా తరలివచ్చిన భక్తులు

నమస్తే తెలంగాణ నెట్‌వర్క్ : ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకొని శనివారం ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లోని ఆలయాలు భక్తులతో కిటకిటాడాయి. ఉదయం నుంచే భక్తులు భారీగా తరలివచ్చి ఉత్తర ద్వారం ద్వారా దర్శనాలు చేసుకొని, ప్రత్యేక పూజలు చేశారు. కాళేశ్వర ముక్తీశ్వర స్వామి దేవస్థానం అనుబంధ దేవాలయం

కాళేశ్వరం : ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటున్న భక్తులు

ఏటూరునాగారం: పూజలు చేస్తున్న భక్తులు

రామాలయంలో ప్రధాన అర్చకులు త్రిపురారి కృష్ణమూర్తి శర్మ, రామాలయ అర్చకుడు రామాచారి ఆధ్వర్యంలో వేద పండితులు అర్చక స్వాములచే ఉదయం 5.20 గంటలకు ఉత్తర ద్వార దర్శనం, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భూపాలపల్లి పట్టణంలోని మంజూర్‌నగర్ శ్రీ వేంకటేశ్వరస్వామిని మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు గండ్ర జ్యోతి దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారు భక్తులకు ప్రసాదాలు అందజేశారు. జిల్లా కేంద్రంలోని కారల్ మార్క్స్ కాలనీలో చతురూప అయ్యప్ప సహస్ర లింగేశ్వర స్వామి ఆలయం, సాయిబాబ ఆలయం, హనుమాన్ నగర్‌లోని భక్తాంజనేయ స్వామి ఆలయం, సుభాష్ కాలనీలోని రామాలయం, టేకుమట్ల మండలం ఆశిరెడ్డిపల్లి శ్రీ భూనీల సమేత వేంకటేశ్వర స్వామి దేవాలయం, మహదేవపూర్ మండలకేంద్రంలోని మందరగిరి వేంకటేశ్వరస్వామి, శివాలయం , నాగేంద్రగిరి అయ్యప్పస్వామి, సూరారం హనుమాన్ ఆలయం, అంబట్‌పల్లిలోని అమరేశ్వర ఆలయాలకు భక్తులు భారీగా తరలివచ్చి పూజలు చేశారు. రేగొండ మండలం కోటంచ లక్ష్మీనర్సింహస్వామిని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు దంపతులు కుటుంబ సభ్యులతో కలిసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ములుగు జిల్లా మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామిని అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ దంపతులు దర్శించుకొని, స్వామివారికి నిర్వహించిన తైలాభిషేకంలో పాల్గొన్నారు. ఏటూరునాగారం మండలకేంద్రంలోని స్రీతారామచంద్రస్వామి ఆలయం, గోవిందరావుపేట మండలకేంద్రంలోని శ్రీగోవిందరాజుస్వామి ఆలయంలో భక్తులు ఉత్తర ద్వార దర్శనం చేసుకొని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

ములుగుటౌన్, డిసెంబర్ 23 : చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో వినియోదారుల దినోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వస్తువులు వాటి నాణ్యత, సామర్థ్యం, స్వచ్ఛత పలు అంశాలపై వినియోగదారుడు తమ హక్కులను వినియోగించుకోవచ్చని తెలిపారు. సివిల్ సప్లయ్ డీఎం రాములు, కలెక్టరేట్ ఏవో ప్రసాద్, జిల్లా వినియోగదారుల సమాఖ్య అధ్యక్షుడు మల్లయ్య, కోశాధికారి రంజిత్, లీగల్ అడ్వైజర్ ఓంకార్ పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

జిల్లా కేంద్రంలోని నేషనల్ హైవే 163పై ఉన్న యూటర్న్ వద్ద జరుగుతున్న ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని కోరుతూ మానవ హక్కుల కమిటీ రాష్ట్ర ఈసీ మెంబర్ చల్లూరి మహేందర్ కోరారు. శనివారం కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ పాల్గొన్నారు.

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

విద్యా ప్రమాణాలు పెంచాలి : డీఈవో

కాటారం, డిసెంబర్ 23 : జిల్లాలో విద్యాభివృద్ధికి కృషి చేయాలని డీఈవో రాంకుమార్ అన్నారు. మండలంలోని చింతకాని, కొర్లకుంట గ్రామాల్లోని పాఠశాలలను ఆయన శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేస్తూ విద్యార్థుల భవిష్యత్‌కు ప్రణాళికలు తయారు చేసి నాణ్యమైన విద్యనందిస్తూ వంద శాతం ఉత్తీర్ణతకు పాటు పడాలన్నారు. ఆయన వెంట సెక్టోరల్ ఆఫీసర్ లక్ష్మణ్, అసిస్టెంట్ కార్యదర్శి శనిగరపు భద్రయ్య ఉన్నారు.

ఉపాధ్యాయులకు సూచనలు చేస్తున్న డీఈవో

లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

మహదేవపూర్, డిసెంబర్ 23 : ఈ నెల 30న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సై రాజ్ కుమార్ తెలిపారు. భూపాలపల్లి జిల్లా న్యాయస్థానంలో జరగబోయే లోక్ అదాలత్‌లో కక్షిదారులు తమ కేసులను రాజీ మార్గంలో పరిష్కరించుకోవాలని సూచించారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలముగా సమస్త జనులకు తెలియజేయునది ఏమనగా! నా క్లయింటు అయిన సలుంఖే దత్తాత్రే, తండ్రి: ద్యాండేఒ, వయస్సు: 31 సం.లు, వృత్తి: వ్యాపారం, నివాసం: S.R.R. తోట, వరంగల్ గారు డీకొండ రమేష్, తండ్రి: జనార్దన్, వయస్సు: 28 సం.లు, వృత్తి: వ్యాపారం, నివాసం: శాంతినగర్, కరీమాబాద్, వరంగల్ గారితో ఈ క్రింద పేర్కొనబడిన షెడ్యూల్ దాఖలా ఆస్తి కొనుగోలు నిమిత్తము విక్రయ ఒప్పంద పత్రము చేసుకొని కొంత మొత్తం భయనగా ఇచ్చియున్నారు. కావున క్రింద పేర్కొనబడిన ఆస్తిపై ఎవరికైనా ఎటువంటి అభ్యంతరాలు, ఆక్షేపణలు ఉన్న యెడల నేటి నుండి ఏడు (7) రోజులలో నాకు గాని, నా క్లయింటుకు గాని లిఖితపూర్వకంగా ఆధారాలతో సంప్రదించగలరు. గడువులోపు ఎటువంటి అభ్యంతరాలు, ఆక్షేపణలు రానిచో నా క్లయింటు మిగిలిన డబ్బులు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోగలరు. గడువు తదుపరి వచ్చు అభ్యంతరాలు ఆక్షేపణలు చెల్లనేరవు మరియు అంగీకరించబడదు. డీకొండ రమేష్ గారు షెడ్యూలులో చూపబడిన ఆస్తికి సంబంధించిన ఖాళీ స్థలం (1) విక్రయ దస్తావేజు డాక్యుమెంటు నెం. 377/2018 యస్.ఆర్.ఓ. వరంగల్ (ఫోర్టు) మరియు (2) విక్రయ దస్తావేజు డాక్యుమెంటు నెం. 341/2020 యస్.ఆర్.ఓ. వరంగల్ (ఫోర్టు) ద్వారా ఖరీదు చేసి GWMC పర్మిషన్ పొంది ఇల్లు కట్టినారు.

షెడ్యూలు ఆస్తి: S.R.R. తోట, ఫోర్టు వరంగల్ గ్రామం, ఖిలా వరంగల్ మండలం, వరంగల్ జిల్లాలో ఇంటి నెం. 16-1-164/3/2/A/1, సర్వే నెం. 1736/3, మొత్తం విస్తీర్ణం: 150.00 చ.గ.లు గల దానికి హద్దులు: తూర్పు: 30 ఫీట్ల రోడ్, పడమర: ఓంప్రకాష్ గారి ఖాళీ స్థలం, ఉత్తరం: బొమ్మజు సతీష్ గారి ఇల్లు ఇంటి నెం. 16-1-164/3/2, దక్షిణం: కృష్ణ మూర్తి గారి ఖాళీ స్థలం.

గమనిక: ఈ ప్రకటన నా క్లయింటు కోరికమేరకు ఇవ్వనైనది.
తేది: 23-12-2023,
ఇట్లు: మార్గం అమరేందర్, అడ్వకేట్-నోటరీ, దేశాయిపేట్ రోడ్, యల్.బి. నగర్, వరంగల్. ఫోన్: 0870-2565304. సెల్: 9493319374.

ఘనంగా సింగరేణి ఆవిర్భావ వేడుకలు

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 23 : సింగరేణి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం జీఎం కార్యాలయం, అంబేద్కర్ స్టేడియంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భూపాలపల్లి ఏరియా జనరల్ మేనేజర్ బల్లారి శ్రీనివాసరావు హాజరై సింగరేణి పతాకాన్ని ఆవిష్కరించారు.

స్టాళ్లను ప్రారంభిస్తున్న జీఎం శ్రీనివాసరావు

వివిధ డిపార్ట్‌మెంట్ల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్టాళ్లను, ఫుడ్‌కోర్టులను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకతను పెంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాబోయే రోజుల్లో నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యాలను సాధించాలని జీఎం అన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం జ్యోతి, సింగరేణి అధికారులు వెంకటరామిరెడ్డి, అజ్మీరా తుకారాం, కవీంద్ర, రవికుమార్, రామకృష్ణారెడ్డి, కుమారస్వామి, క్రాంతికుమార్, శ్యాంప్రసాద్, రవికుమార్ పాల్గొన్నారు.

వైభవంగా నాపాక బ్రహ్మోత్సవాలు

చిట్యాల, డిసెంబర్ 23 : మండలంలోని నైన్‌పాక గ్రామ నాపాక ఆలయంలో లక్ష్మీనరసింహుడి కల్యాణం వైభవంగా జరిగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండో రోజు స్వామివారి కల్యాణానికి భక్తులు పెద్దఎత్తున హాజరయ్యారు. కల్యాణం అనంతరం కోలాటాల పోటీల్లో ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు.

కల్యాణం జరిపిస్తున్న వేద పండితులు

అనంతరం ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు. చిట్యాల, టేకుమట్ల జడ్పీటీసీలు గొర్రె సాగర్, పులి తిరుపతిరెడ్డి, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మధువంశీకృష్ణ స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో తొట్ల లక్ష్మీ ఐలయ్య, పెండ్యాల ప్రభాకరాచారి, శ్రీనివాస్, రమేశ్ పాల్గొన్నారు.

అన్ని మతాలకు సమాన గౌరవం

■ ఎమ్మెల్యే సత్యనారాయణరావు
■ క్రిస్టియన్లకు కానుకుల పంపిణీ

భూపాలపల్లి రూరల్/గణపురం, డిసెంబర్ 23 : రాష్ట్ర ప్రభుత్వం అన్ని మతాలను సమానంగా గౌరవం కల్పిస్తుందని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. నియోజకవర్గానికి ప్రభుత్వం వెయ్యి క్రిస్మస్ గిఫ్టులు పంపగా శనివారం మంజూర్‌నగర్ కల్వరి చర్చిలో కలెక్టర్ భవేశ్‌మిశ్రాతో కలిసి ఎమ్మెల్యే క్రిస్టియన్లకు పంపిణీ చేశారు. అలాగే గణపురం మండల కేంద్రంలోని సియోను ప్రార్థన మందిరంలో క్రిస్టియన్లతో కలిసి క్రిస్మస్ కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని మతాల ప్రజల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, దేవాలయాలు, చర్చిల స్థలాలు దోపిడీకి గురికాకుండా చర్యలు తీసుకుంటామని, దేవుడి సొమ్ము ఆశించిన వారిపై కఠినంగా వ్యవహరిస్తామని తెలిపారు. నియోజకవర్గ ప్రజలకు ఐదేళ్లపాటు సేవకుడిగా పనిచేస్తానని ఎమ్మెల్యే తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో క్రైస్తవ ప్రార్థన స్థలాల అభివృద్ధికి, శ్మశాన వాటికల ఏర్పాటుకు అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు,


కానుకలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గండ్ర , కలెక్టర్ భవేశ్ మిశ్రా

అధికారులు, మున్సిపల్ కౌన్సిలర్లు, పాస్టర్లు పాల్గొన్నారు.

ఉద్యోగ సంఘాలను కాపాడుకుంటాం

కృష్ణకాలనీ : ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ ఆ సంఘాలను కాపాడుకుంటామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. శనివారం టీఎన్‌జీవోఎస్ భవనంలో జిల్లా అధ్యక్షుడు బూరుగు రవి అధ్యక్షతన నిర్వహించిన స్టాండింగ్ కౌన్సిల్ సమావేశానికి ఎమ్మెల్యే గండ్ర, కలెక్టర్ భవేశ్‌మిశ్రా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీఎన్‌జీవో నాయకుల కోరిక మేరకు ప్రతి నెల ఒకటో తేదీన వేతనాలు ఇచ్చేలా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ తాను బాధ్యతలు స్వీకరించినప్పుడు టీఎన్‌జీవోఎస్ భవనానికి పునాదులు కూడా లేవని, 2021లో భవన నిర్మాణానికి రూ.10 లక్షలు, 2023లో రూ. 20 లక్షలు విడుదల చేశానని, మరిన్ని నిధులు కేటాయిస్తానన్నారు. ఈ సందర్భంగా టీఎన్‌జీవోస్ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బూరుగు రవి మూడోసారి ఎన్నికయ్యారు. జిల్లా సహాధ్యక్షుడిగా కేసు రేందర్‌రెడ్డి, కార్యదర్శిగా ఏ ధశరథ రామారావు, కోశాధికారిగా ఎండీ అన్వరుల్లా బేగ్, ఉపాధ్యక్షులుగా కే వంశీకృష్ణ, ఎం వేణు, బీ అలివేలు, టీసాగర్, ఎండీ గౌసొద్దీన్, బీ తిరుపతి రెడ్డి, సంయుక్త కార్యదర్శులు, ఆర్గనైజింగ్ సెక్రటరీ, కార్యాలయ సెక్రటరీ, పబ్లిసిటీ సెక్రటరీ, ఎగ్జిక్యూటివ్ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మరం జగదీశ్వర్, వెంకటేశ్వర్లు, సత్యనారాయణ గౌడ్, శ్రీనివాస్‌రావు, వీరయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

వేటగాళ్ల ఉచ్చుకు తగిలి విద్యుత్ ఉద్యోగులకు గాయాలు

ఏటూరునాగారం, డిసెంబర్ 13 : వేటగాళ్లు అమర్చిన ఉచ్చుకు విద్యుత్ ఉద్యోగులు తగిలి తీవ్రగాయాలైన ఘటన ములుగు జిల్లా ఏటూరునాగారం మండలం ముల్లకట్ట వద్ద జరిగింది. శుక్రవారం రాత్రి మండలంలోని ముళ్లకట్ట వద్ద బ్రేక్ డౌన్ (విద్యుత్ వైర్ తెగడం) అయిన సమాచారం అందుకున్న ఏటూరునాగారం ఏఈ అశోక్ మరమ్మతు కోసం సిబ్బందికి ఆదేశాలివ్వగా, కన్నాయిగూడెం లైన్‌మెన్ పల్లెబోయిన రవి, వెంకటాపురం జేఎల్‌ఎం దిలీప్ ఆ ప్రాంతానికి వెళ్లారు. అప్పటికే అక్కడ వన్యప్రాణుల కోసం వేటగాళ్లు అమర్చిన వైర్లకు వారు తగలడంతో విద్యుదాఘాతానికి గురై గాయాలపాలయ్యారు. వెంటనే తోటి సిబ్బందికి సమాచారమివ్వగా ఏటూరునాగారంలోని సామాజిక దవాఖానకు తరలించి, చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వరంగల్‌కు తరలించినట్లు ఏఈ తెలిపారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

గణిత టాలెంట్ టెస్ట్‌లో విద్యార్థుల ప్రతిభ

మహదేవపూర్, డిసెంబర్ 23 : మండలంలోని బొమ్మాపూర్ పాఠశాల విద్యార్థులు తెలుగు మీడియం విభాగంలో నిర్వహించిన జిల్లా స్థాయి గణిత టాలెంట్ టెస్ట్‌లో ప్రథమ బహుమతి సాధించినట్లు హెచ్‌ఎం శంకరయ్య తెలిపారు. మండల స్థాయిలో విద్యార్థులు చందన, కే రిషిత రాణించి జిల్లా స్థాయిలో ప్రతిభ కనబర్చారన్నారు. వారిని హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

గ్రామాల్లో 'భారత్ సంకల్ప' యాత్ర

పలిమెల,డిసెంబర్23 : మండలంలోని లెంకలగడ్డ, మోదేడు గ్రామాల్లో శనివారం భారత్ సంకల్ప యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీఎం రవికుమార్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి కల్పనకు రుణాలు ఇస్తున్నదని అర్హులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పశువైద్య శాస్త్రవేత్త సాయికిరణ్, సీసీ స్వామి, బ్యాంక్ అధికారి అనిల్, సర్పంచులు తోట రమాదేవి, చిడం నాగయ్య పాల్గొన్నారు.

తపాలా కార్యాలయం సందర్శన

ములుగురూరల్, డిసెంబర్ 23 : జిల్లా కేంద్రంలోని తపాలా కార్యాలయాన్ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు సందర్శించారు. ప్రతి 4వ శనివారం నోబ్యాగ్ డేలో భాగంగా పిన్‌కోడ్, ఆధార్ సెంటర్ పనితీరు, మహనీయుల ఫొటోలతో విడుదల చేసిన పోస్టల్ స్టాంపులపై కార్యాలయ అధికారులతో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీసీఈబీ కార్యదర్శి విజయమ్మ మాట్లాడుతూ అకడమిక్ క్యాలెండర్ అనుసరించి ప్రతి పాఠశాలలో నోబ్యాగ్ డే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పిట్టల మల్లయ్య, చంద్రమౌళి, మమత, శారద పాల్గొన్నారు.

దివ్యాంగులకు కృత్రిమ పరికరాలు

కృష్ణకాలనీ, డిసెంబర్ 23 : ప్రొఫెసర్ జయశంకర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జయశంకర్ భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాలోని 22 మంది దివ్యాంగులకు కృత్రిమ కాళ్లు, చేతులు అందజేసినట్లు ఫౌండేషన్ చైర్మన్ అయిలి మారుతి తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ రెండు జిల్లాల నుంచి 22 మంది దివ్యాంగులు తమను సంప్రదించగా వారిని సొంత ఖర్చులతో ప్రత్యేక బస్సులో విశాఖ పట్టణానికి తీసుకుపోయి కృత్రిమ కాళ్లు, చేతులు పెట్టించామన్నారు. కార్యక్రమంలో సభ్యులు కొత్తపెల్లి రాజు, చింతకింది రాజు, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

రామప్పలో పర్యాటకుల సందడి

వెంకటాపూర్, డిసెంబర్ 23 : మండలంలోని రామప్ప ఆలయం శనివారం పర్యాటకులు, విద్యార్థులు, భక్తులతో సందడిగా మారింది. వివిధ రాష్ర్టాల నుంచి పదివేల మందికి పైగా పర్యాటకులు సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారులు హరీశ్‌శర్మ, ఉమాశంకర్ పూజలు నిర్వహించి, తీర్థ ప్రసాదాలు అందించారు. ఆలయ చరిత్ర, విశిష్టతను టూరిజం గైడ్స్ వివరించగా ఆసక్తిగా విన్నారు. అలాగే జర్మనీ దేశస్తులు అండ్రూస్-సబీనా దంపతులు రామప్పను దర్శించుకున్నారు. రామప్ప టెంపుల్ ఆర్కిటెక్చర్ బాగుందన్నారు. తెలంగాణలో టెంపుల్స్, వంటకాలు చాలా బాగున్నాయన్నారు.

దళారులను నమ్మి మోసపోవద్దు

కృష్ణకాలనీ, డిసెంబర్ 23 : రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలని జంగేడు పీఏసీఎస్ చైర్మన్ మేకల సంపత్‌కుమార్ యాదవ్ కోరారు. మున్సిపల్ పరిధి 11వ వార్డు వేశాలపల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో 11వ వార్డు కౌన్సిలర్ బానోత్ రజితా జుమ్మలాల్, పీఏసీఎస్ డైరెక్టర్ పులి వేణుగోపాల్ గౌడ్, నాయకులు ఆకుల మహేందర్, బోయిని రాజబాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న లక్ష్మీనర్సింహరావు

కార్యకర్తలకు అండగా ఉంటాం

బీఆర్‌ఎస్ ములుగు జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి

ఏటూరునాగారం, డిసెంబర్ 23 : ఇటీవల నిర్వహించిన ఎన్నికల్లో ఇచ్చిన ప్రజా తీర్పును గౌరవించి పార్టీ కార్యకర్తలు, నాయకులకు అండగా ఉంటామని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు కాకులమర్రి లక్ష్మీనర్సింహరావు అన్నారు. మండల కేంద్రంలోని తన నివాసంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాయకులు, కార్యకర్తలు ధైర్యంగా ఉండాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అమలుకు తాము కూడా సహకరిస్తామన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయాలని ఈ సందర్భంగా మంత్రి సీతక్కను కోరారు. ఈ సమావేశంలో జిల్లా కో ఆప్షన్ సభ్యురాలు వలియాబీ, ఎంపీపీ అంతటి విజయ, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు గడదాసు సునిల్‌కుమార్, నాయకులు తుమ్మ మల్లారెడ్డి, ఖాజాపాషా, మహేశ్, రఘు, నర్సయ్య, రాంనర్సయ్య, రామయ్య, కృష్ణప్రసాద్, రామకృష్ణ, రమేశ్, రాజేశ్, సర్పంచ్ రామ్మూర్తి, నాగరాజు, ఎండీ సలీం, కన్నాయిగూడెం బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు సమ్మయ్య పాల్గొన్నారు.

సింగరేణి ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలి

■ అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

భూపాలపల్లి రూరల్, డిసెంబర్ 23: సింగరేణి ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం సింగరేణి ఇల్లందు క్లబ్‌హౌస్‌లో సింగరేణి యూనియన్ ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఎలాంటి అవకతవకలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాన్నారు. ఈ సందర్భంగా లేబర్ ఎన్‌ఫోర్స్‌మెంట్

మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

అధికారి శంకర్ బ్యాలెట్ పేపర్, బ్యాలెట్ బాక్సులను నిర్వహణ పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో కో ఆర్డినేటర్ అజ్మీరా తుకారాం, డీవైపీఎంలు క్రాంతికుమార్, శ్యాంప్రసాద్, సాదన్, సంజీవరావు పాల్గొన్నారు.

మేడారం మహాజాతరపై ఎస్పీ సమీక్ష

ములుగు, డిసెంబర్23 (నమస్తే తెలంగాణ) : మేడారం మహా జాతరపై పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ గౌస్ ఆలం శనివారం తన కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా జాతరకు వచ్చే భక్తుల భద్రత ఏర్పాట్లపై పోలీసులతో చర్చించారు. రద్దీని క్రమబద్ధీకరించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులతో మాట్లాడారు. రోడ్ల సౌకర్యం, చెక్‌పోస్టుల ఏర్పాటు తదితర అంశాలపై, గత జాతరలో ఎదుర్కొన్న సమస్యలను ప్రధానంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఫిబ్రవరిలో నిర్వహించే జాతరకు పోలీస్ శాఖ ద్వారా చేపట్టాల్సిన చర్యలను రోడ్డు మ్యాప్ సిద్ధం చేసి, అధికారులకు అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో ఓఎస్డీ అశోక్‌కుమార్, ఏటూరునాగారం ఏఎస్పీ సంకీర్త్, అదనపు ఎస్పీ సదానందం, డీఎస్పీలు శుభాష్‌బాబు, రవీందర్, సీఐలు రాజు, రంజిత్‌కుమార్, శంకర్, కిరణ్, రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

లారీ ఢీకొని ఒకరి మృతి

ములుగురూరల్, డిసెంబర్ 23 : రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందిన ఘటన ములుగు జిల్లా కేంద్రంలో శుక్రవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. మండలంలోని చింతలపల్లికి చెందిన మామిడిపెల్లి భిక్షపతి (33) మేస్త్రీగా పని చేస్తున్నాడు. ఈ నెల 22న దేవుడి సామగ్రి తీసుకొస్తానని ఆయన ఇంట్లో చెప్పి ములుగు వెళ్లి, బంధువైన ఎనగందుల నరేశ్‌తో కలిసి రాత్రి బైక్‌పై వెళ్తూ బస్టాండ్ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా, హనుమకొండ నుంచి ఏటూరునాగారం వైపు వేగంగా వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో భిక్షపతి అక్కడికక్కడే మృతి చెందగా బైక్ నడుపుతున్న నరేశ్‌కు తీవ్ర గాయాలయ్యాయి. నరేశ్‌ను చికిత్స కోసం ములుగు దవాఖానకు తరలించారు. మృతుడి భార్య సుకన్య ఫిర్యాదు మేరకు లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

కరోనా నిబంధనలు పాటించాలి

ములుగురూరల్, డిసెంబర్ 23 : ప్రభుత్వ దవాఖానల్లో కరోనా నిబంధనలు పాటించాలని డీఎంహెచ్‌వో అల్లెం అప్పయ్య సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి వైద్య ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా నుం చి వైద్యాధికారులతో కలిసి ఆయన పాల్గొన్నారు. వీసీ అనంతరం వైద్య సిబ్బందితో ఆయన మాట్లాడుతూ మాస్కులు తప్పని సరిగా వినియోగించేలా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో క్రాంతికుమార్, ప్రోగ్రాం ఆఫీసర్, పవన్‌కుమార్, డాక్టర్ అనిల్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీసీలో పాల్గొన్న డీఎంహెచ్‌వో

ఘనంగా అయ్యప్ప పడిపూజ

కాటారం, డిసెంబర్ 23 : మండలకేంద్రంలోని ఆనంద ధర్మశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి అయ్యప్ప స్వామి పడిపూజ ఘనంగా జరిగింది. భూపాలపల్లి జడ్పీ చైర్‌పర్సన్ జక్కు శ్రీహర్షిణీ రాకేశ్ మామ మొగిలి 18వ నారికేల సందర్భంగా పడిపూజ నిర్వహించారు. స్వాములకు భిక్ష ఏర్పాటు చేశారు. గండూరి భాను ప్రసాద్ శర్మ, బచ్చు అశోక్ పాల్గొన్నారు.

గర్భిణులకు టీకాలు

మహదేవపూర్, డిసెంబర్ 23 : మండలంలోని అంబట్‌పల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో శనివారం చిన్నారులు, గర్భిణులకు వ్యాధి నిరోధక టీకాలు వేశారు. కార్యక్రమంలో డాక్టర్ విజయ్ కుమార్, ఏఎన్‌ఎంలు కనకదుర్గ, శైలజ, శ్రీలత పాల్గొన్నారు.

పోలీసులకు నకిలీ పురుగుల మందు విక్రేత అప్పగింత

కాళేశ్వరం, డిసెంబర్ 23 : మహదేవపూర్ మండలంలోని రైతులకు నకిలీ పురుగుల మందులు అమ్ముతున్న వ్యక్తిని వ్యవసాయ శాఖ అధికారులు శనివారం పట్టుకొని పోలీసులకు అప్పగించారు. వారి కథనం ప్రకారం.. మిర్చి పంట రోగాలకు బ్రాండెడ్ కంపెనీ పురుగుల మందుల కంటే బాగా ప ని చేస్తాయని వారం రోజులుగా బయో మందులు, నూనె మందుల కిట్లు అధిక ధరలకు అమ్ముతూ ఓ వ్యక్తి రైతులను మోసం చేస్తున్నాడు. ఈ విషయం తెలిసిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారి విజయభాస్కర్ నిందితుడిని పట్టుకోవాలని ఏవో మహేశ్‌ను ఆదేశించారు. దీంతో ఆయన ఆరా తీయగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ప్రకాశం జిల్లాకు చెందిన నర్సింహారెడ్డిగా తేలింది. వెంటనే అతడిని అధికారులు పట్టుకొని పోలీసులకు అప్పగించారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

గణపురం, డిసెంబర్ 23 : రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. శనివారం ఆయన మైలారం, కర్కపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలను ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచుల ఫోరం మండల అధ్యక్షుడు పొట్ల నగేశ్, మైలారం సర్పంచ్ నల్లాని అరుణా తిరుపతిరావు, ఏఈవో ప్రణయ్, తోట వెంకట్‌రెడ్డి, రమేశ్, రేపాక రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

మెడనొప్పి వేధిస్తుందా..
★ మెడనొప్పి తీవ్రంగా ఉండి, మెడ ఎటు కదిలించిన వంగినా మెడనొప్పి తీవ్రంగా వేధిస్తుంటే సంప్ర: డా.పావుశెట్టి శ్రీధర్, హోమియో ఫిజీషియన్, హన్మకొండ బస్టాండ్ దగ్గర, బాలసముద్రం రోడ్, ఫైర్‌స్టేషన్ ఎదురుగా, HNK. సెల్: 9959638214.
NTW-323102

HOUSE FOR SALE
★ Hunter Road 600 Sq.yds., E/F Property with (G+1) Independent House Built in 200 yds. for Sale @ Subedari Road, Hanumakonda. Genuine Buyers only Contact @ 9052224110.
NT-319210

సెప్టిక్ ట్యాంక్ క్లీనర్
★ సెప్టిక్ ట్యాంక్ క్లీనర్ నూతన సాంకేతిక పరిజ్ఞానంతో గల్పర్ మిషన్ ద్వారా సెప్టిక్ ట్యాంక్ క్లీన్ చేయబడును. డి.ఎస్. రావు. Cont: 9849145043, 9866584455.
NTW-315036

CHANGE OF NAME
★ I, UPPALA VIVEKANANDAM, R/o. 1-1-104/A/1, Prashanth Nagar, Opp. NIT, Kazipet, Warangal-Hanumakonda, TS. Changed My Name as UPPALA VIVEKANANDA, S/o. Uppala Nagabhushanam.
NT-324488

WANTED
★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం, జీతం: 18K. Ph: 9160900024/9640400073.
NT-314383

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ ప్రకటన కేవలం 200/- మాత్రమే
4 లైన్ల బ్లాక్ అండ్ వైట్ 4 ప్రకటనలకు కేవలం 600/- మాత్రమే
ప్రతి అదనపు లైన్‌కు 50/- మాత్రమే
ప్రకటనల విభాగం : 9182777552

HANAMKONDA	WARANAGAL
9182777563	9182777556
9182777618	9182777557
9182777213	9182777558

JAYASHANKAR BHUPALPALLY - 9182777559
MULUGU - 9182777135
MAHABUBABAD - 9182777554
JANGAON - 9182777565